క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రామారావు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

ఆమదాలవలస రూరల్: మండలంలోని బెల మాం పంచాయతీ లొద్దలపేట గ్రామానికి చెందిన ఇలపండ రామారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మృతుడి తల్లి కూడా ఐదు రోజుల వ్యవధిలో మరణించారు. దీంతో ఈ కుటుంబానికి ఆర్థికసాయం అందించాలనే భావనతో రామారావుతోపాటు 1995–96లో పదో తరగతి చదువుకున్న తోటి స్నేహితులంతా కలిసి రూ.20 వేలు సమకూర్చారు. సోమవారం స్నేహితుడి కుటుంబసభ్యులకు ఈ మొత్తం సోమవారం అందజేశారు. రామారావుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తోటి స్నేహితులకు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పైడి హరిప్రసాద్, మడ్డి అన్నాజీరావు, పెనుగుర్తి సంగమేశ్వరరావు, పైడి ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న మహిళలు

నరసన్నపేట: మండలంలోని గొట్టిపల్లి చెరువు గట్టుపై నివసిస్తున్న కుటుంబాలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని పలువురు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా ఇక్కడే నివసిస్తున్నామని, తాము ఎస్టీ కులస్తులమన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. పిల్లలను కూడా చదివించుకోలేక పోతున్నామన్నారు. దీనిపై తహసీల్దార్ ఎ.సింహాచలం వద్ద ప్రస్తావించగా.. పైఅధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ధర్మాన పద్మప్రియ

నరసన్నపేట: మండల కేంద్రంలోని మారుతీనగర్ మొదటి వీధిలో సోమవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అన్నదానాన్ని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, ఆర్.శ్రీధర్ (బుజ్జి), పొట్నూరు సాయిప్రసాద్, రమణ సాహు, గెంబల ఆనంద్, పొట్నూరు సుధ, నేతింటి రమణ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 112 పంట కోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాన్ని నిర్వహిస్తున్న ప్రతాప్ నందా

ఎల్.ఎన్.పేట: మండలంలోని 47 రెవెన్యూ గ్రామాల్లో 28 ఇన్సూరెన్స్ యూనిట్ల ద్వారా 112 పంట కోత ప్రయోగాలను నిర్వహించటం జరుగుతుందని డివిజనల్ ఉపగణాంక అధికారి ప్రతాప్ నందా అన్నారు. మండలంలోని జంగాలవలస రెవెన్యూ గ్రామం పరిధిలో సోమవారం పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనా పథకంలో భాగంగా పంట కోత ప్రయోగాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంటల దిగుబడి తగ్గిన రెవెన్యూ గ్రామాల్లో బీమా వర్తించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్.ఎన్.పేట ఏఎస్‌ఓ పి.అప్పలనాయుడు, వీఆర్వో, వీఆర్‌ఏ, గ్రామ సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

నేడు చొర్లంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఎల్.ఎన్.పేట: మండలంలోని చొర్లంగి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చొర్లంగి గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రముఖ వైద్యులు వచ్చి 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.



బూర్జ: నీలాదేవిపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



కొత్తూరు: ఓండ్రుజోలలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



బూర్జ: నీలాదేవిపురంలో పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



నరసన్నపేట: కోమర్తిలో రోగులకు మందులు సరఫరా చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణ

ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యం

ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో సోమవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, 45 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు కోరారు. –సాక్షి నెట్‌వర్క్



బూర్జ: నీలాదేవిపురంలో రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది



సరుబుజ్జిలి: కొత్తకోటలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మెళియాపుట్టి: సిరియాఖండిలో వైద్య శిబిరంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, అధికారులు



సారవకోట: అలుదులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఆమదాలవలస రూరల్: నిమ్మతొర్లాడలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



జలుమూరు: యలమంచిలిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



పొందూరు: నందివాడలో పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



సరుబుజ్జిలి: కొత్తకోటలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు



ఎల్.ఎన్.పేట: కరకవలసలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



ఎల్.ఎన్.పేట: పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు



ఆమదాలవలస రూరల్: గర్భిణులకు భోజనాలు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి సోమవారం వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు భగవాన్ సత్యసాయి భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. శ్యామలాపురం గ్రామానికి చెందిన ఇప్పిలి ఉపేంద్ర దంపతులు పౌష్టికాహార కిట్లను సమకూర్చారని సత్యసాయి భజన మండల కన్వీనర్ ఎ.నారాయణరావు తెలిపారు. గర్భిణులు ప్రతీరోజు సమతుల్యమైన పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్లు సూచించారు.

అక్కులపేటలో..

ఆమదాలవలస రూరల్: అక్కులపేట సత్యసాయి సేవా సమితి చేస్తున్న సేవలు పేదలకు ఎంతో భరోసా ఇస్తున్నాయని అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కూన మీనాకుమారి అన్నారు. పీహెచ్‌సీలో సత్యసాయి సేవా సమితి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రతీ నెల 9వ తేదీన పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు ప్రతి నెలా అన్నదానం చేయడం సమితి సేవలకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమం ఏడు సంవత్సరాలుగా అంతరాయం లేకుండా నిర్వహించడం ఎంతో ఆనందాయకమన్నారు. ఈ నెల డాక్టర్ బి.వసంత తన తల్లిదండ్రుల పేరుతో పౌష్టికాహారాన్ని సమకూర్చారు. సమితి జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, సీహెచ్ సూర్యారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంపై విచారణ

సారవకోట: మండలంలోని బోడసముద్రం అంగన్‌వాడీ కేంద్రంపై సూపర్‌వైజర్ ఎ.పద్మావతి సోమవారం విచారణ చేపట్టారు. కేంద్రం నిర్వహణ తీరుపై గ్రామానికి చెందిన కొందరు యువకులు ఫుడ్ కార్పొరేషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు విచారణ చేపట్టినట్లు ఆమె తెలిపారు. అయితే తమకు ప్రభుత్వ నిబంధనల మేరకు సరుకులు అందుతున్నాయని లబ్ధిదారులు తెలియజేసినట్లు పేర్కొన్నారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

కొత్తూరు: మండలంలోని నివగాంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు టంకాల రమణరావు అన్నారు. గ్రామంలోని కాపు వీధిలోని మురుగు కాలువల్లో మట్టితీసి రోడ్డు మీద వేశారని, ఆ మట్టిని తొలగించకపోవడంతో వీధిలో ఉన్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పంచాయతీ పరిధిలోని మురుగు కాలువల్లో చెత్తను పూర్తిగా తొలగించపోవడంతో రోడ్లుపై మురుగునీరు ప్రవహిస్తుందన్నారు. పలుసార్లు ఫిర్యాదు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు.

భూముల రీసర్వేతో మేలు

పాతపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే మండలంలో వేగంగా సాగుతోందని తహసీల్దార్ రవిచంద్ర తెలిపారు. మండలంలోని బోరుభద్ర గ్రామంలో సోమవారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. మండలంలో ఇప్పటికే పలు రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించామన్నారు. సర్వే పూర్తయితే నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలు రైతులకు అందించనున్నామన్నారు. ఆధునిక టెక్నాలజీ వినియోగించి డిజిటల్ రికార్డులు సిద్ధం చేస్తున్నామన్నారు. వీఆర్వో, గ్రామ సర్వేయర్, వీఆర్‌ఏలతో కూడిన బృందానికి రోజుకు 40 నుంచి 50 ఎకరాల భూమిని సర్వే చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సవిరిగాన శ్రీనివాసరావు, ఎం.లక్ష్మణరావు, పెద్దలోగిడి సర్పంచ్ డకర చిన్నారావు, వీఆర్వో ఆదినారాయణ, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



బోరుభద్రలో డ్రోన్ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

ప్రణాళికలతోనే అభివృద్ధి సాధ్యం

సరుబుజ్జిలి: ముందస్తు ప్రణాళికల ద్వారానే పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. పంచాయతీల సమగ్రాభివృద్ధిపై అన్నిశాఖల అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీల్లో ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ ఆనందరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

పోడు పట్టాలు మంజూరు చేయాలని వినతి

కొత్తూరు: మండలంలోని గూనభద్ర అపోజిట్ ఆర్ ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న గదవపేట నిర్వాసితులకు సంకిలి కొండలో పోడు పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్ పెదకోట సాదుబాబు, పి.వెంకటరావు, జి.వెంకటరావుతోపాటు పలువురు కోరారు. సీతంపేట ఐటీడీఏలో ఏపీఓకు సోమవారం స్పందనలో వినతిపత్రం అందజేశారు. వంశధార ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోయి ఉపాధికి నోచుకోవడం లేదన్నారు. సంకిలి కొండపై 40 గిరిజన కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఆటవీశాఖ అధికారులు పేర్లు నమోదు చేసుకుని ఇంతవరకు పట్టాలు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోడు పట్టాలు మంజూరు చేసి ఉపాధి చూపించాలని కోరారు.



ఐటీడీఏ ఏపీఓకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నిర్వాసితులు, సర్పంచ్ సాదుబాబు

కషాయాలతో వరిలో తెగుళ్ల నివారణ

సరుబుజ్జిలి: పలుపత్ర ద్రావణంతో వరితెగుళ్ల నివారణ సాధ్యపడుతుందని ప్రకృతి వ్యవసాయ టీమ్ సభ్యులు జగన్, మన్మధరావు తెలిపారు. రావివలస గ్రామ ప్రకృతి వ్యవసాయ యూనిట్‌లో పలుపత్ర కషాయం తయారీ విధానం గురించి సోమవారం రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఔషధ మొక్కలైన వేప, కానుగ, సీతాఫలం, వయ్యారిభామ, అత్తకోడళ్లు, ఉమ్మెత్త వంటి 5 కిలోల ఆకులు, 5 లీటర్ల గోమూత్రంతో కలిపి తయారుచేసిన కషాయాన్ని పొలాల్లో పిచికారీ చేస్తే తెగుళ్ల నివారణ సాధ్యపడుతుందన్నారు. రావివలస, పాలవలస సర్పంచ్‌లు వండాన కృష్ణ, గజ్జన మోహన్‌రావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ జగదీష్, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి లలిత, తిరుపతిరావు, రవి, పూర్ణ, శ్రీదేవి, సుమ, రైతులు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన..

కొత్తూరు: వరి పంటలో వచ్చే పొటాష్ లోపాన్ని జిల్లేడు ద్రావణంతో నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ జగన్ అన్నారు. ఆల్తి గిరిజన పంచాయతీ తామరగూడలో సోమవారం జిల్లేడు ద్రావణం తయారీ విధానాన్ని గిరిజన రైతులకు వివరించారు. జిల్లేడు ద్రావణం పిచికారీ చేయడం ద్వారా వరి చేనులో ఎర్ర కుళ్ల తెగుళ్ళ, రసం పీల్చే పురుగులను నాశనం చేయవచ్చన్నారు. కొత్తూరులో ప్రకృతి వ్యవసాయం ఏంటీ సూర్యనారాయణ ద్రవజీవామృతం వినియోగిచంచడ వల్ల పంటలకు కలిగే ప్రయోజనాలు వివరించారు. ద్రవజీవామృతం తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. డీఏపీకి బదులు ద్రవజీవామృతం వాడుకోవాలన్నారు.



సరుబుజ్జిలి: పలుపత్ర ద్రావణం తయారు చేస్తున్న యూనిట్ బృందం



కొత్తూరులో ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: మహిళలు, చిన్నాలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యులతో విజయవాడ అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. కమిటీ సభ్యులతో కలిసి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయా వర్గాల వారి సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. భవిష్యత్‌లో కూడా వారికి మేలు జరిగేలా మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కొత్తూరు: ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు డీలర్లు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని స్థానిక ఏఓ శ్రీనివాసరావు సూచించారు. కొత్తూరులోని ఎరువులు, పురుగు మందులు షాపులను సోమవారం తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం పలు రకాల పురుగు మందులు, ఎరువుల నమూనాలను సేకరించి తిరుపతిలో ఉన్న కోడింగ్ పరీక్ష కేంద్రానికి పంపించారు. పరీక్షల్లో నాణ్యతాప్రమాణాలు లోపించినట్లు రిపోర్టులు వస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అధిక రేట్లకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో వ్యవసాయ విస్తరణ అధికారి బూడిద రమేష్ ఉన్నారు.

ప్రజాసేవతో సంతృప్తి

ఆమదాలవలస రూరల్: గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పేదరికాన్ని నిర్మూలించవచ్చని జిల్లా గ్రామసేవా ఇన్‌చార్జ్ ఎం.రవీంద్రబాబు అన్నారు. మండలంలోని నెల్లిపర్తిలో గ్రామ సేవ మహాయజ్ఞం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అర్హులైన వారికి గొడుగులు, పాదరక్షలు, చిన్నారులకు ప్రొటీన్ ఫుడ్స్, ఆట బొమ్మలు పంపిణీ చేశారు. గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. గ్రామంలో బాల వికాస్ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సమితి జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, సూర్యారావు, యూత్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, బాలవికాస్ గురు వు పద్మ, సభ్యులు పాల్గొన్నారు.



వృద్ధులకు గొడుగులు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

గండి పూడ్చివేత

బూర్జ: మండలంలోని తుడ్డలి, డొంకలపర్త గ్రామాల సమీపంలోని ఓని గెడ్డ కాలువకు ఇటీవల గండి పడింది. దిగువ ప్రాంతాల రైతులు సోమవారం గండిని పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువ గట్టు గండి పడిందని రైతులు తెలిపారు. దిగువ భాగాన ఉన్న రైతులుకు నీరు అవసరం లేకపోవడంతో ఇంతవరకు గండి పూడ్చకుండా విడిచిపెట్టారన్నారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో గండిని పూడ్చినట్లు తెలిపారు.



గండిని పూడ్చుతున్న రైతులు